క్లుప్తంగా

కేంద్రమంత్రిని కలసిన ఏటీ అసోసియేషన్ ప్రతినిధులు



విమాన నమూనాను రామ్మోహన్‌నాయుడుకు అందజేస్తున్న నటుకుల మోహన్

శ్రీకాకుళం అర్బన్: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును విశాఖలోని విమానాశ్రయంలో సోమవారం ఉదయం జిల్లాకు చెందిన ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ (ఏటీ) ప్రతినిధులు నటుకుల మోహన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విమానం నమూనాను కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు అందజేశారు. విమాన ప్రయాణికుల సమస్యలు, విశాఖ నుంచి దూర ప్రాంతాలకు విమాన సదుపాయాల గురించి ప్రస్తావించినట్లు మోహన్ తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి తనవంతుగా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

యోగాతో మానసిక ప్రశాంతత



సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు నంబాళ్ల కల్పన అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి ధ్యానం, శ్వాస శిబిరం ఆధ్వర్యంలో ఐదు రోజుల యోగా కోర్సు పూర్తి చేసిన సందర్భంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగా చేయడం వలన ఒత్తిడిని కలుగజేసే హార్మోన్లను తగ్గిస్తుందని, నిరాశ, నిస్పృహలను దూరం చేస్తుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లాడి చంద్రశేఖర్, కర్రి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.


ఘనంగా సచ్చిదానంద స్వామి జన్మదిన వేడుకలు



స్వామి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో గణపతి సచ్చిదానంద స్వామి (అప్పాజీ) జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామీజీకి పాదుగా పూజ, గురుగీత పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, ఆయుష్ హోమం చేశారు. విశాఖకు చెందిన డాక్టర్ దబ్బాకుల లక్ష్మణరావు, లత దంపతులు ఆశ్రమానికి స్మార్ట్ కలర్ టీవీని బహూకరించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: త్రినాథస్వామి మహోత్సవాల సందర్భంగా నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేట రెడ్డికవీధిలో సోమవారం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు రామిరెడ్డి, గాంధీ పాల్గొన్నారు.

పరామర్శ..



లక్ష్మణ్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయికుమార్

రణస్థలం: మండలంలోని చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త కొణతాల లక్ష్మణ్ రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే అతని సోదరుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాలు తెలుసుకున్న పార్టీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కంబపు నర్సింహులు రెడ్డి, నాయకులు చిల్ల గాంధీ, రెడ్డి శ్రీను తదితరులు ఉన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పూజలందుకున్న స్వామివారు

కల్యాణ వైభోగం



కల్యాణ వేడుకల్లో భక్తజనం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని చిన్నబజారు దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రేజేటి వెంకట శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ అపూర్వ ఘట్టాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించి పూజలు చేశారు.

బాలాజీ ఆలయంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న శివబాలాజీ ఆలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు గోపినంబాళ్ల సీతారామాచార్యులు, సత్య కూర్మాచార్యుల నేతృత్వంలొ భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణను సంప్రదాయంగా నిర్వహించారు. ఐదువేల మందికి ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తులసీరావు, సామంత్ పాల్గొన్నారు.

పలు ఆలయాలలో కల్యాణ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో జేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివార్లకు కల్యాణ వేడుకలు జరిగాయి. మొండేటివీధిలోని లలితా సమేత శివకామేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, షిర్డీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కల్యాణ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



రమ్యాతిరుమలలో కల్యాణ వేడుకలు

ఉత్తరేశ్వరునికి కల్యాణం

బలగ ఉత్తరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులను నగరంలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు.



మొండేటివీధి శివకామేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

రమ్యాతిరుమలలో..

అరసవల్లి రోడ్డులోని రమ్యాతిరుమలలో వేంకటేశ్వరుని కల్యాణ వేడుకలు జరిగాయి. ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి అర్చకులు కరి రంగనాథ వేణుమాధవాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా సంప్రదాయ గురుకులం ఫ్యాకల్టీ లలీ కృష్ణ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. నృత్య బృందాన్ని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయ ఈవో మాధవి పాల్గొన్నారు.



బలగ ఉత్తరేశ్వరుని ఊరేగింపు



నృత్య కళాకారులకు సత్కారం


రహదారిపై నిలిచి వర్షంనీరు

ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నపాటి వర్షం కురిసినా కేశవరావుపేట గ్రామం ప్రారంభంలోని రోడ్డుపై నిలిచిపోతుంది. రోడ్డు పల్లపు ప్రాంతంలో ఉండటం, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవటంతో రోడ్డుపై రోజుల తరబడి నీరు నిల్వ అవుతుంది. భారీ వర్షాలు పడితే వర్షం నీరు మరింత ఎక్కువగా నిలిచిపోతుంది. వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బంది పడతున్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షంనీరు

భౌపెడుతున్నాయ్..



పాలఖండ్యాం వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

జి.సిగడాం: మండలంలో గెద్దకంచరాం, పాలఖండ్యాం, నాగులవలస, పెంట, సీతంపేట, నడిమివలస, మద్రివలస, వాండ్రంగి, జి.సిగడాం గ్రామాలతోపాటు మరో పది గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఆవు దూడలపై గుంపుగా దాడిచేసి చంపేశాయి.

పాడి రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కుక్కలను గ్రామాలకు దూరంగా విడిచిపెట్టాలని కోరుతున్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రణస్థలం: దేరసాం గ్రామంలో గల అభయాంజనేయ స్వామి 7వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు ఆకెళ్ల ప్రవీణ్ శర్మ, రాంపల్లి పట్టాభి అధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు, భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అల్లినగరంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు నిల్వలను తొలగించారు. వీధుల్లో చెత్తాచెదారాలను శుభ్రం చేసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సచివాలయం సిబ్బంది అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఎచ్చెర్ల: ప్రకతి వ్యవసాయ పద్ధతులను పాటించడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీసీ సి.హెచ్.సూర్యనారాయణ తెలిపారు. ధర్మవరం పంచాయతీలోని పలు గ్రామాల్లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పంటలను సోమవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వినియోగించడం వల్ల పౌష్టికాహార ఉత్పత్తులను సాధించవచ్చన్నారు. దీనివల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

సమాచార హోర్డింగ్‌లు మూసేశారు..

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు సోమవారం జిల్లాకు విచ్చేశారు. జాతీయ రహదారిలోని పలు చోట్ల ప్రధాన నగరాలు, కిలో మీటర్లు సూచన కోసం ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను స్వాగత ఫ్లెక్సీలతో కూటమి నాయకులు మూసేశారు.



కొయిరాళ్ల కూడలి వద్ద హోర్డింగ్‌ను ఫ్లెక్సీలతో మూసివేసిన దృశ్యం

ఆధ్యాత్మిక కలయిక

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రత్యేక ఆధ్యాత్మిక కలయిక కార్యక్రమానికి పలువురు స్వామీజులు సోమవారం విచ్చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వవార్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు పరిసరాలలో ఉన్నటువంటి దేవాలయాలను స్వామీజీలు సందర్శించారు. 17వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కొంచాడ రాజాశ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి స్వామీజి పీఠాధిపతులతో విచ్చేయగా భక్తులు స్వాగతం పలికారు.



ఒకేచోట కలుసుకున్న స్వామీజీలు

సెగిడిపేట గ్రామస్తుల కోలాటం



సందడిగా మోహిని భద్రాంభికా ఉత్సవం

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహిని భద్రాంభికా గ్రామదేవత ఉత్సవం సందడిగా జరిగింది. సోమవారం సాయంత్రం గ్రామంలో పులి వేషాలు, పెళ్లి సెట్టింగ్, ట్రాక్టర్‌పై హరిశ్చంద్ర నాటకం ప్రదర్శన, యువత డాన్సులు ఆకట్టుకున్నాయి. కామదహన మంటపం వద్ద జెయింట్ వీల్, చిన్నారులు ఆడుకునేందుకు పలు యంత్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక సెగిడిపేట గ్రామస్తుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అనుపు ఉత్సవం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



కామదహన మంటపం వద్ద ఎగ్జిబిషన్

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు స్వాగతం

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం: జిల్లాకు వచ్చిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులకు టీడీపీ శ్రేణులు సోమవారం స్వాగతం పలికాయి. ఎచ్చెర్ల మండల పరిధి అరిణాంఅక్కివలస నుంచి కుశాలపురం సింహద్వారం, గ్రామాల కూడళ్ల వద్ద, రణస్థలం మండలం పైడిభీమవరం వద్ద విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్వాగతం పలికారు. రణస్థలంలోని కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి మంత్రులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.



రణస్థలం: పైడిభీమవరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు

వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి



ఝాన్సీలక్ష్మీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామరాజు, పాఠశాల సిబ్బంది

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

పాఠశాల ఆవరణలో ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర వహించిన వీర వనిత ఝాన్సీలక్ష్మీబాయి అని కొనియాడారు. ఉపాధ్యాయులు వై.సునిత, ఎస్.రాధ, బి.భవాని, వి.కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం

కాశీబుగ్గ:

పలాస మండలం మాకన్నపల్లి సచివాలయంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న మాజీ సైనికుడు కొల్లి ఫాల్గుణరావు సేవలకు చక్కనైన సత్కారం లభించింది. అత్యవసర పరిస్థితిలో కష్టకాలంలో ఉన్నటువంటి పేదవారికి ఆరుసార్లు రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడినందుకు గుర్తించి గౌరవించారు. సాంపేటలో అనాథులు, వృద్ధులకు ఆశ్రయం అందిస్తున్న సీతయ్య ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ప్రముఖలతో కలిసి సీతయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు గుల్ల మోహన్, గుల్ల రమేష్‌లు ఫాల్గుణరావును దుశ్శాలువతో సత్కరించారు.



ఫాల్గుణరావును సత్కరిస్తున్న దృశ్యం

నిరుపేదకు సాయం

కవిటి: మండలంలోని అర్.బెలగాం పంచాయతీ బెలగాం కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి గ్రామయువత ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన యువకుడు కోన గణేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. పుట్టుకతో వైకల్యంతో బాధపడుతున్న ఇతని మరణం పేదవారైన తల్లిదండ్రులకు మానసిక ఆవేదనను మిగిల్చింది. ఈ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్థానిక యువత పది వేల రూపాయలను విరాళాలుగా సేకరించారు. అలాగే ఈ కుటుంబం పరిస్థితిని ఎస్‌జీఎఫ్ సంస్థకు వివరించడంతో వారు కూడా రూ. ఆరు వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుడి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు.



గణేష్ తల్లిదండ్రులకు సాయాన్ని అందజేస్తున్న యువకులు